క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం

అశ్వాపురం: గ్రామాలు, ఇండ్ల చుట్టూ పరిశుభ్రత ఉంటే ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని భారజల కర్మాగారం జీఎం గంటా శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఆదివారం గుంతలు పూడ్చివేశారు. ఈ కార్యక్రమానికి జీఎం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధికారులు, ఉద్యోగులు గౌతమీనగర్ కాలనీ నుండి ప్రధాన సెంటర్ వరకు రహదారిపై గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సెక్యూరిటీ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

మణుగూరుటౌన్: ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో 134 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ కేటగిరి పోస్టులను భర్తీ చేయాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. ఆదివారం టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఏడాదికి సంబంధించి ఏరియాలో 134 బ్యాక్‌లాగ్ కేటగిరి పోస్టులను గుర్తించడం జరిగిందని, అర్హులైన ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ఆ కేటగిరి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, ఇబ్రాయిల్, మస్తాన్, రామాచారి, మురళీ కృష్ణ, రేగిచెట్టు ముకేశ్‌కుమార్, సుద్దాల సంపత్‌కుమార్, రాజ్‌కుమార్, దినేశ్, రమేశ్‌బాబు, ఇమ్రాన్, నరేశ్‌కుమార్, కటారి ప్రసాద్, వినయ్‌కుమార్, బత్తుల శ్రీనివాస్, సమర్పన్ దాసరి సురేశ్, కల్యాణ్, వెంకటేష్, నరేందర్ ఉన్నారు.

2న మాలమహానాడు సభ

అశ్వాపురం: నవంబర్ 2న హైదారాబాద్‌లో జరిగే మాలమహానాడు సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డులో ఆదివారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 2న జరిగే సభలకు వేలాదిగా తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా నాయకులు మేకల భాస్కర్, గడకారి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు భారీ బతుకమ్మను తీరొక్క పూలతో పేర్చి ఆడిపాడారు. అనంతరం పట్టణంలో బతుకమ్మలతో శోభాయాత్రను నిర్వహించారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ ఆదివాసీ సంఘం నాయకులు

మణుగూరుటౌన్: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించి ఏజెన్సీలోని ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో కొమరం భీం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలిగించాలని డిమాండ్ చేశారు. తామంతా రాజ్యాంగాన్ని నిమ్మ పోరాటం చేస్తున్నామని, రాజ్యాంగం ధర్మం వైపే నిలబడుతుందని అన్నారు. అనంతరం భద్రాచలంలో జరిగే ధర్మ యుద్ధంసభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

దమ్మపేట: పూసుకుంట అటవీ మార్గంలో కొండరెడ్ల ప్రజా రవాణా కొరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పూసుకుంట గ్రామంలో సీపీఎం సానుభూతిపరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీలకు బీటీ రోడ్డు, కల్వర్టులు, అంతర్గత సీసీ రోడ్లు నిర్మించి, విద్య, వైద్యం, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించి, పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, దొడ్డా లక్ష్మీనారాయణ, మడివి విజయ్, ఉమేష్, గంగులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగట్లే..!

- రాత్రయితే అంధకారమే..
- పెరుగుతున్న దొంగల భయం
- అశ్వారావుపేట మున్సిపాలిటీ దుస్థితి..



బీఎస్‌ఆర్ నగర్‌లో స్తంభాలపై వెలగని లైట్లు..

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో వీధి దీపాలు వెలగట్లేదు. దీంతో రాత్రి వేళల్లో వీధుల్లో సంచారం ప్రమాదకరంగా తయారైంది. బీఎస్‌ఆర్ నగర్, ఏఎస్‌ఆర్ కాలనీ, బీసీ కాలనీ, అటెండర్స్ కాలనీ, కోతమిషన్ బజార్, మోడల్ కాలనీ, ఇలా చెప్పుకుంటూ పోతే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆవాసాల్లో వీధి దీపాల ఇక్కట్లున్నాయి. నిర్మాణంలో ఉన్న గృహాల వద్ద ఇటుకలు, ఇనుప చువ్వలు, ఇసుక, కంకర గుట్టలను రోడ్ల మీదే వదిలేస్తుంటారు. పాదచారులు రాత్రి వేళల్లో ఇబ్బందులకు గురవుతున్నారు. ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థినులు రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లేందుకు సాహసించలేక పోతున్నారు. అరుగులు, కల్వర్టులు, ఖాళీ ప్రహరీలు ఉండే ప్రాంతాల్లో చీకటి ఉంటే పోకిరీలు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. దీనికి తోడు గడిచిన రెండు వారాల్లో రెండు ద్విచక్ర వాహనాలను అపహరించుకు పోయారు. ఖబర స్తాన్ రోడ్‌లో ఓ షాపు సీసీ కెమెరాలో ఈదృశ్యాలు రికార్డు అయ్యాయి. ఎదురుగా ఉన్న సందులో వీధి దీపాలు లేక చీకటిగా ఉంటే ఆసందు లోనుంచి టూవీలర్‌ను ఇద్దరు దుండగులు దొంగలించి పట్టుకుపోయారు. దీనికి తోడు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్న సెంటర్ లైటింగ్ పనుల కారణంగా ఖమ్మం, భద్రాచలం రోడ్‌లు తవ్వి వదిలేశారు. దీంతో ఎప్పుడు ఎటునుంచి డైవర్షన్ ఇస్తున్నారో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై భారీ గుంతలు కనపడక పలు ప్రమాదాలు కూడా జరిగాయి.

అశ్వారావుపేటలోని 22 మున్సిపల్ వార్డుల్లో 1,858 విద్యుత్ స్తంబాలు ఉన్నాయి. వీటికి ఎన్ని లైట్లు ఉన్నాయో మున్సిపాలిటీ సిబ్బందికీ తెలియదు. మున్సిపాలిటిగా ఏర్పాటయిన తర్వాత అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీల సిబ్బంది, కమిషనర్ తప్ప ఇతర సిబ్బంది లేరు.. కేటాయించబడలేదు. దీంతో ముగ్గురు మాత్రమే ఎలక్ట్రీషియన్లు విధుల్లో ఉన్నారు. సిబ్బందిని పెంచాల్సిన అవసరం కూడా ఉంది. వీధి దీపాలు ఏర్పాటు చేసి మున్సిపాలిటీ పరిధిలో చోరీలు, ఆకతాయిలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

అన్ని స్తంభాలకూ లైట్లు అమర్చుతాం..



మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి స్తంభానికీ వీధి లైట్లు అమర్చుతాం. సిబ్బంది కొరత ఉన్నందును పర్యవేక్షణ ఆలస్యం అవుతుంది. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మేరకు అశ్వారావుపేట మున్సిపాలిటీలో అన్ని స్తంభాలకు లైట్లు అమర్చి వారే నిర్వహణ చేస్తారు. అతి త్వరలోనే వీధి దీపాలు అమర్చబడతాయి.

– బి.నాగరాజు, మున్సిపల్ కమిషనర్, అశ్వారావుపేట

అమ్మో పాములు!

- కార్మిక వాడల్లో కలకలం
- ఇటీవల వరుస ఘటనలు



బంగ్లాస్ ఏరియాలో స్నేక్ క్యాచర్ పట్టుకున్న అరుదైన పాము (ఫైల్)

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పాముల విస్తృత సంచారం కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు కంటి మీద కునుకు లేకుండా చేసున్నాయి. ఈ ఏడాది వానలు గతేడాదితో పోలిస్తే అధికంగా రావడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చే వరదలతో వచ్చే పాములతో కార్మికులకు విధుల్లో ఆటంకం కలిగిస్తుండటంతో పాటు కార్మికులు, అధికారులు నివసించే పీవీకాలనీ, బంగ్లాస్ ఏరియాల్లో సంచరించి బెంబేలెత్తిస్తున్నాయి. పీవీకాలనీల్లోని పోస్టాఫీస్ ఏరియాలతో పాటు, బాంబేకాలనీ టిటూ క్వార్టర్లతో పాటు ఫిల్టర్ బెడ్ ఏరియాల్లో, కార్మికులు నివసించే శివారు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి దూకుతుండటంతో కార్మికులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- ఓసీ–2లో విధుల్లో ఉన్న ఓ కార్మికుడిని పాత సామాన్లలో ఉన్న ఓ పాము కాటు వేయగా.. ఆ కార్మికుడిని మణుగూరు ఏరియా ఆస్పత్రి నుంచి కొత్తగూడెం తరలించి చికిత్సలందించారు.
- ఎస్‌ఎంఎస్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీకి రా మెటీరియల్ దిగుమతి కోసం వచ్చిన లారీలో నిద్రిస్తున్న డ్రైవర్‌ను క్యాబిన్‌లో పాము కాటు వేయడంతో ప్లాంట్ మెనేజ్‌మెంట్ వెంటనే స్పందించడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది.
- ఇటీవల బంగ్లాస్ ఏరియాలో ఓ అరుదైన పాము అధికారి ఇంట్లోకి చొరబడటంతో మూడు గంటల పాటు శ్రమించి స్నేక్ క్యాచర్ చాకచక్యంగా పట్టుకున్నారు.
- బంగ్లాస్ ఏరియాలో ఓ అధికారి ఇంట్లోని ఏసీలోకి పాము సంచరించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.
- పీవీ కాలనీలో ఫిల్టర్ బెడ్ శివారుతో పాటు వాటర్ ట్యాంక్ ఏరియా, బాంబేకాలనీ, పోస్టాఫీస్ సమీపంలో ఉండే కార్మిక వాడల్లో ఇళ్లల్లోకి చేరుతున్న పాములు లెక్కలేనివని కార్మికులు వాపోతున్నారు.

పిచ్చి చెట్లు తొలగించాలి..



కార్మిక వాడల్లో పిచ్చి చెట్ల తొలిగింపులో సివిల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్మిక కుటుంబాలకు తాగు నీటిని విడుదల చేసే పంపు ప్రదేశంలో, సబ్ స్టేషన్, రైల్వే గేట్‌కు వెళ్లే దారుల్లో మొలిచిన చెట్లను సైతం తొలిగించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడం లేదు. పాములు వస్తున్నాయని ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గతంలో పిచ్చిచెట్ల తొలిగింపులో వేగంగా పనులు చేపట్టిన అధికారులు ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్మికులు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రత పాటించి వీధి లైట్లు వెలిగేలా చూసుకోవాలి.

– వై.రాంగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి

సరైన చర్యలతో రేబిస్ నియంత్రణ



మణుగూరురూరల్: రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారులు



భద్రాచలంటౌన్: పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మణుగూరురూరల్: సరైన చర్యలతో రేబిస్ వ్యాధిని నివారించవచ్చని జిల్లా పశువైద్యాధికారి అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం వాసవినగర్‌లోని ప్రాథమిక పశువైద్యశాలలో రేబిస్ వ్యాక్సిన్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా వెటర్నరీ అండ్ హస్బెండరీ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రసాద్‌లు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. శిబిరంలో 82కుక్కలకు, మూడు పిల్లులకు రేబీస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో మణుగూరు పశువైద్యాధికారిణి డాక్టర్ సరస్వతి, డాక్టర్ బాలకృష్ణ, సిబ్బంది ఎస్.ప్రతాప్, బి.వెంకటేశ్వర్లు, పి.వీరభద్రం, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: రేబిస్ నివారణ కోసం కుక్కలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని భద్రాచలం పశువైద్యాధికారి ఎం.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకని ఆదివారం పట్టణంలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధిక టీకాలు వేశారు. అనంతరం కుక్కల యజమానులకు అవగాహన కల్పించారు. పెంపుడు, వీధి కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ములకపాడులోని పశువైద్య శాలలో ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎస్.లిఖిత ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో కలిసి ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రేబీస్ వ్యాధి గురించి పూర్తి వివరాలు తెలియజేశారు. పెంపుడు జంతువుల యజమానులు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా టీకాలు వేయించడం చాలా అవసరమని సిబ్బంది ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది గాంధీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓకు ఎంఏఓగా పదోన్నతి

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండ వ్యవసాయ విస్తారణాధికారి (ఏఈఓ) పర్సా శ్రీనివాసరావుకు మండల వ్యవసాయ శాఖాధికారి (ఎంఏఓ)గా శాఖా పదోన్నతి పొందారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా బాసర మండల ఎంఏఓగా బదిలీ అయ్యారు. దీంతో రెండు మండలాల రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

మణుగూరుటౌన్: మండల కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నేత్ర వైద్య సహాయకులు గంజికుంట్ల సంజీవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్నా.. శస్త్రచికిత్సలు చేయించుకోదలుచుకున్నా.. ఏరియా ఆస్పత్రిలో జరిగే వైద్యపరీక్షలకు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని అక్టోబర్ 7న రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం వారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కుల వ్యవస్థను నిర్మూలిద్దాం..



గుండాల: నినాదాలు చేస్తున్న నాయకులు, స్థానికులు

గుండాల: కుల వ్యవస్థను నిర్మూలిస్తూ నూతన సమాజాన్ని నిర్మించాలని, కులమతాలు లేని నూతన ప్రజాస్వామ్య విప్లవం పోరాడాలని ఆలిండియా ట్రైబల్ ఫారం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ నాయకులు యాసారపు వెంకన్న పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా.. దుర్గం చుక్కయ్య అధ్యక్షతన కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో యువకులు, విద్యార్థుల మెదళ్లలో కుల, మతాలను నూరిపోస్తోందని, నూతన ప్రజాస్వామ్య విప్లవాలతో ఈ వైఖరిపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఈసం కృష్ణ, కార్యదర్శి నరేష్, కల్తి నరసింహారావు, బొమ్మెర సత్యం, హరీష్, గాందేర్ల వీరాస్వామి, చలపతిరావు శ్రీను, అంజయ్య, రవీందర్, పోతయ్య సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: కులమతాలకు అతీతంగా కలసిమెలసి బతుకుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం జరిగిన కుల వివక్షపై ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, దాని అనుబంధ శ్రేణులు కుల, మత చిచ్చులుపెట్టి పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. అందరం ఐక్యంగా జీవిస్తే దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, వెంకటేశ్వర్లు, రాము, రమేశ్, లక్ష్మి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అడుగులు

చర్ల: ఏజెన్సీ ప్రాంతమైన చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయని, 15 యేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నానికి త్వరలో ఫలితం రానున్నదని దేవాదాయశాఖ స్టాండింగ్ కమిటీ కౌన్సిలర్, హైకోర్టు అడ్వకేట్ సీపీ సతీష్ పేర్కొన్నారు. ఆదివారం చర్లలోని రైస్‌పేటలో గల శైలజావిమార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద విద్యార్థులు ఇంటర్‌తోనే వారి విద్యాభ్యాసాన్ని నిలిపివేస్తున్నారని, ఈ విషయాన్ని గుర్తించి ఏళ్ల తరబడిగా ఉన్నతాధికారులకు వివరిస్తూ వస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాల మంజూరుకు తెలంగాణా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు వెళ్లాయని ఆయన చెప్పారు. త్వరలోనే దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొని చర్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తారనే నమ్మకం ఉందని ఆయన అన్నారు. సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, చీమకుర్తి వీరభద్రం, తడికల లాలయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

దుర్గామాత ఊరేగింపు

మణుగూరుటౌన్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాళీమాత ఆలయ దుర్గామాత ఊరేగింపు ఆదివారం భవానీ మాలధారులు పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు ఆడుతూ ర్యాలీ చేయగా.. మాలధారులు పల్లకిలో దుర్గాదేవిని ఉంచి జై భవానీ అంటూ నినదించారు. ఈ ర్యాలీ పట్టణంలో పూలమార్కెట్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు తిరిగి ఆలయానికి చేరింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పర్ణశాలలో విజయలక్ష్మిగా..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆరవ రోజు ఆదివారం శ్రీ లక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకారంలో..

ములకలపల్లి: మండలవ్యాప్తంగా దేవీశరన్నవ రాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ములకలపల్లి ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారు ఆదివారం గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భారీగా భక్తులు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వీధుల్లో నిర్వహించిన కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. వినాయకనగర్‌లో చండీ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దారా రమణమూర్తి, పప్పుల నర్సయ్య, జాలం నీలయ్య, నక్కా ప్రసాద్, జాలం శివ శంకర్, బానోత్ సాయి, దుర్గ ప్రసాద్, బుక్యా శంకర్ తదితరులు పాల్గొన్నారు.




మణుగూరుటౌన్: పల్లకీలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



దుమ్ముగూడెం: విజయలక్ష్మి అవతారంలో అమ్మవారు

స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు



బూర్గంపాడు: మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలతో పాటుగా గ్రామ సర్పంచ్ స్థానాలకు కూడా అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. బూర్గంపాడు ఎంపీపీ స్థానం బీసీ(జనరల్), జెడ్పీటీసీ స్థానం ఎస్టీ(జనరల్)కు కేటాయించారు. మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను అధికారులు ప్రకటించారు. కృష్ణసాగర్ ఎంపీటీసీ స్థానం ఎస్టీ(జనరల్), ఇరవెండి ఎంపీటీసీ బీసీ(జనరల్), బూర్గంపాడు–1 ఎంపీటీసీ స్థానం బీసీ(జనరల్), బూర్గంపాడు–2 బీసీ(మహిళ),నాగినేనిప్రోలు–1 జనరల్ మహిళ, నాగినేనిప్రోలు–2 జనరల్, లక్ష్మీపురం ఎస్సీ(జనరల్), వేపలగడ్డ ఎస్టీ(మహిళ), ఉప్పుసాక ఎస్టీ(మహిళ), అంజనాపురం జనరల్(మహిళ), మోరంపల్లిబంజర ఎస్టీ(జనరల్), సారపాక–1 ఎస్సీ(మహిళ), సారపాక–2 బీసీ(మహిళ), సారపాక–3 ఎస్సీ(జనరల్), సారపాక–4 జనరల్, సారపాక–5 బీసీ(జనరల్), సారపాక–6 బీసీ (మహిళ)లకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

సర్పంచ్ స్థానాలకు..

మండలంలోని 18 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. బూర్గంపాడు సర్పంచ్ స్థానం బీసీ(జనరల్), లక్ష్మీపురం సర్పంచ్ స్థానం జనరల్‌కు, టేకులచెరువు సర్పంచ్ స్థానం ఎస్సీకు కేటాయించారు. అంజనాపురం ఇరవెండి,కోయగూడెం, కృష్ణసాగర్, మోరంపల్లిబంజర, మోతె పట్టీనగర్, ముసలిమడుగు పినపాక పట్టీనగర్ గ్రామ సర్పంచ్ స్థానాలను ఎస్టీ(జనరల్)కు కేటాయించారు. సారపాక, నాగినేనిప్రోలు, నకిరిపేట, సోంపల్లి, తాళ్లగొమ్మూరు, ఉప్పుసాక, వేపలగడ్డ గ్రామసర్పంచ్ స్థానాలను ఎస్టీ(మహిళ)కు కేటాయించారు.

అశ్వాపురం: మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ రిజర్వేషన్ ఎస్టీ అయ్యాయి. ఎంపీటీసీలు 12 కాగా జగ్గారం–ఎస్టీ మహిళ, అమ్మగారిపల్లి ఎస్సీ మహిళ, అశ్వాపురం–1 బీసీ జనరల్, అశ్వాపురం–2 ఎస్టీ జనరల్, అశ్వాపురం–3 ఎస్టీ జనరల్, అశ్వాపురం –4 బీసీ మహిళ, గొల్లగూడెం ఎస్సీ జనరల్, గొందిగూడెం జనరల్, తుమ్మలచెరువు జనరల్ మహిళ, మొండికుంట బీసీ మహిళ, మల్లెలమడుగు ఎస్టీ మహిళ, రామచంద్రాపురం బీసీ జనరల్ అయ్యాయి. మండల పరిధిలోని నాన్ షెడ్యూల్‌లోని మొండికుంట సర్పంచ్ బీసీ–మహిళ, ఎంపీటీసీ–బీసీ మహిళ, మల్లెలమడుగు సర్పంచ్ ఎస్సీ, ఎంపీటీసీ ఎస్టీ మహిళ, ఆనందాపురం సర్పంచ్ ఎస్టీ జనరల్, నెల్లిపాక బీసీ జనరల్, రామచంద్రాపురం సర్పంచ్ జనరల్ రిజర్వేషన్లు వచ్చాయి.

చర్ల: చర్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారయ్యాయి. చర్ల పంచాయతీకి ఎస్టీ మహిళ, బోదనెల్లి ఎస్టీ జనరల్, సీ కత్తిగూడెం ఎస్టీ జనరల్, చినమిడిసిలేరు ఎస్టీ మహిళ, దేవరాపల్లి ఎస్టీ మహిళ, గొమ్ముగూడెం ఎస్టీ మహిళ, గొంపల్లి ఎస్టీ జనరల్, కలివేరు ఎస్టీ జనరల్, కేశవాపురం ఎస్టీ మహిళ, కొత్తపల్లి ఎస్టీ జనరల్, కొయ్యూరు ఎస్టీ జనరల్, కుదునూరు ఎస్టీ మహిళ, కుర్నపల్లి ఎస్టీ జనరల్ లక్ష్మీకాలనీ ఎస్టీ మహిళ, లింగాపురం ఎస్టీ జనరల్, మొగళ్లపల్లి ఎస్టీ మహిళ, పెదమిడిసిలేరు ఎస్టీ జనరల్, పెద్దిపల్లి ఎస్టీ జనరల్, పులిగుండాల స్టీ మహిళ, పూసుగుప్ప ఎస్టీ మహిళ, ఆర్ కొత్తగూడెం ఎస్టీ జనరల్, సత్యనారాయణపురం ఎస్టీ మహిళ, సుబ్బంపేట ఎస్టీ జనరల్, తేగడ ఎస్టీ జనరల్ తిప్పాపురం ఎస్టీ మహిళ, ఉప్పరిగూడెం ఎస్టీ మహిళకు కేటాయించారు. వీటితోపాటు వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రకటించారు.

ఆశలు ఆవిరి..

బూర్గంపాడు/అశ్వాపురం: ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతోపాటు సర్పంచ్ రిజర్వేషన్లు తారుమారు కావటంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. తాము ఆశించిన స్థానాలలో రిజర్వేషన్లు వేరేవారికి కేటాయించటంతో కొందరు నిరాశ నిస్పృహల్లో మునిగిపోయారు. హైకోర్టులో కేసుతో రిజర్వేషన్లు మారుతాయేమో అని ఎదురుచూస్తున్నారు.

ఈ 'సారీ'ఎస్సీలకు దక్కని అవకాశం..

ములకలపల్లి: జెడ్పీటీసీ అభ్యర్థి రిజర్వేషన్‌లో ములకలపల్లి మండలంలో ఈసారీ ఎస్సీ సామాజిక వర్గానికి మొండిచేయి చూపారు. మండల వ్యవస్థ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకూ ఇప్పటికి ఐదు పర్యాయాలు స్థానిక సమరం జరిగినా.. ఒక్కసారి కూడా జెడ్పీటీసీ స్థానంలో వీరికి చోటు దక్కలేదు. కనీసం ఈ సారైనా అవకాశం లభిస్తుందని ఆశించినా చివరకు నిరాశే ఎదురైంది. మండలవ్యాప్తంగా 28,384 ఓటర్లు ఉండగా, వీరిలో ఎస్సీ సామాజిక వర్గానికి సుమారు 3 వేల వరకూ ఓటర్లు ఉన్నారు. మొదటి దఫా నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ స్థానం ఎస్టీ (జనరల్) మిడియం నాగేశ్వరరావు, అటుపిమ్మట ఎన్నికల్లో మరళా ఎస్టీ (జనరల్) సున్నం బాబూరావు, ఆతదుపరి జనరల్ (మహిళ) చేడే పద్మావతి, అటుపిమ్మట బీసీ (జనరల్) బత్తుల అంజి, గత ఎన్నికల్లో ఎస్టీ (జనరల్) సున్నం నాగమణిలు విజయం సాధించారు. ఈ దఫా ఎస్సీలకే అవకాశం దక్కుతుందనుకున్న తరుణంలో బీసీ (మహిళ)కు కేటాయించారు. దీంతో ఎస్సీ ఆశావహుల్లో ఆశలు గల్లంతయ్యాయి. ఇదిలా ఉండగా, మండలంలో పది ఎంపీటీసీ స్థానాల్లో గత ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఎస్సీలకు కేటాయించబడలేదు. ఈ దఫాలోనూ ఎస్సీ సామాజిక వర్గానికి ఎంపీటీసీల్లో ఒక్కరికి కూడా చోటు దక్కలేదని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.